క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రామంతాపూర్: రామంతాపూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గోఖలేనగర్, గణేష్‌నగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గోకుల్‌నగర్, గణేష్‌నగర్, రామంతాపూర్ ప్రధాన రహదారి, శారదానగర్, ఏడీఆర్‌ఎం లైన్, ఓల్డ్ రామంతాపూర్, ఆనంద్‌నగర్, కృష్ణ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ రాములు తెలిపారు. అదేవిధంగా స్ట్రీట్ నంబర్–8 లక్ష్మీనగర్ ఫీడర్, దూరదర్శన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లక్ష్మీనగర్, సాయి చిత్రానగర్, మెయిన్ రోడ్డు, దూరదర్శన్ హోమియో ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్‌లో...

మల్లాపూర్: నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్, 11 కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. బాబానగర్, రవీంద్రనగర్, రాఘవేంద్రనగర్, దుర్గానగర్, కార్తికేయనగర్ కాలనీలో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

కాప్రాలో...

కాప్రా: మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డు వచ్చిన చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో పలు కాలనీలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ ఏఈ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు రామాలయం, ఈశ్వరపురి, వాయుపురి ఫీడర్ల పరిధిలోని డిఫెన్స్ కాలనీ, వాయుపురి, జేజే నగర్, నేరేడ్‌మెట్ పీఎస్ ప్రాంతం, నిర్మల్‌నగర్, సైనిక్‌పురి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హైటెన్షన్ లైన్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: బ్రాహ్మణ సేవా సమాఖ్య, సికింద్రాబాద్ సెనాయ్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఆనంద్‌బాగ్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు వైద్య శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు కామేశ్వరావు, సూర్యకుమారి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం 6వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించినట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమ పూజ, హోమం నిర్వహించినట్లు వెల్లడించారు. సోమవారం శివశక్తి నరేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం, పుట్టపూజ, పుట్టబంగారం తెచ్చుట, గంగాస్నానం వెళ్లుట, అమ్మవారి ఊరేగింపు, ఒగ్గుకథ, మంగళవారం శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి అమ్మవారి కల్యాణ మహోత్సవం, బోనాలు, ఒడి బియ్యం సమర్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టెలిఫోన్ కాలనీ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. రమేష్‌గౌడ్, కోశాధికారి కేబీ నర్సింహ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారం మరువలేనిది

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే సహకారంతో నేరేడ్‌మెట్‌లో అందించిన స్థలంలో చేపట్టిన మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ నిర్మాణ పనులను మల్కాజిగిరి టీయూడబ్ల్యూజే 143, ఐజేయు నాయకులు ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ భవనానికి ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని కోరారు. క్లబ్‌హౌస్, మీడియా హౌస్, ప్రెస్ కౌన్సిల్ హాల్ తదితర సౌకర్యాలతో రానున్న తరాలకు అత్యాధునిక ప్రెస్‌క్లబ్‌ను నిర్మించే దిశగా అడుగులు వేయాలని జర్నలిస్టు నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారాన్ని జర్నలిస్టులు మర్చిపోలేరని తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా నాయకులు గుండ్ల మహేష్‌గౌడ్, టీయుడబ్ల్యూజే ఐజేయు మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి గడ్డమీది గిరిగౌడ్, ఉపాధ్యక్షులు అక్కల రాజుగౌడ్, దుపెట్టి పాండుగౌడ్, గౌరవ అధ్యక్షులు మురళీ యాదవ్, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్, సభ్యులు తదితరులు ఉన్నారు.

లక్షల రూపాయలు హాంఫట్..

> అనుకున్నంత ముడితే చాలు సామాన్యులు చచ్చినా ఎవరికీ పట్టదు.. ఏదైనా ప్రమాదం జరిగితే హడావుడి చేసే అధికారులు.. ప్రమాదం జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలంటే మాత్రం వెనకడుగు వేస్తారు. పాత గోడలపైనే స్లాబ్ వేస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసినా.. కార్పొరేటర్ నిర్మాణాన్ని ఆపాలని ఆదేశించినా.. సాక్షిలో వార్తా కథనం ప్రచురితమైనా.. రాత్రికి రాత్రే స్లాబ్ పనులను పూర్తి చేసేశారు. దీనిపై స్థానికంగా ప్రజలు పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పాత నిర్మాణంపై చేపట్టిన కల్వర్టు నిర్మాణంపై రాత్రికి రాత్రే వేసిన స్లాబ్

- రాత్రికి రాత్రే స్లాబ్ నిర్మాణం పూర్తి
- కాంట్రాక్టరుతో కుమ్మక్కైన అధికారులు
- నిర్మాణం ఆపాలని కార్పొరేటర్ ఆదేశం
- అయినా.. పట్టించుకోని అధికారులు
- పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కుషాయిగూడ: పాత నిర్మాణాలపై కల్వర్టు నిర్మాణం చేస్తూ ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నా.. పత్రికల్లో వార్త కథనాలు ప్రచురితమైనా పట్టింపు లేకుండా పోయింది. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన అధికారులు రాత్రికి రాత్రే పాత నిర్మాణంపై చేసిన కల్వర్టు నిర్మాణంపై స్లాబ్ నిర్మాణం పూర్తి చేసేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, పత్రికల్లో వచ్చిన వార్త కథనాలకు స్పందించిన స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పనులు నిలిపివేయాలని ఆదేశించినా ఆమె ఆదేశాలను పట్టించుకోకుండా రాత్రికి రాత్రే కల్వర్టుపై స్లాబ్ నిర్మాణం పూర్తిచేశారు.

● స్థానికులు ప్రశ్నించినా.. నేతలు వద్దన్నా..

చర్లపల్లి డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో కల్వర్టు నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయి. నూతనంగా కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సిన అధికారులు గతంలో ఉన్న పాత పిల్లర్లపైనే నిర్మాణం చేపడుతూ లక్షల రూపాయాల ప్రజాధనం దోచుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ విషయాన్ని సాక్షి ఈ నిర్లక్ష్యాన్ని ఏమ'నాలా'? అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. సాక్షిలో వచ్చిన కథనానికి స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయినా అధికారుల తీరులో మార్పులేదు. మరో అడుగు ముందుకేసి ఏకంగా రాత్రికి రాత్రే స్లాబ్ నిర్మాణం పూర్తి చేయడంతో స్థానికులు, ప్రజాప్రతినిధులు ముక్కుమీద వేలేసుకున్నారు.

● ముడుపులు ముట్టడం వల్లే..

కల్వర్టు నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరు కాగా ప్రస్తుతం అధికారులు చేపడుతున్న నిర్మాణం వల్ల కేవలం 50శాతం నిధులతో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో లక్షల రూపాయాల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం జంకకుండా నిర్మాణం చేపట్టడంలో అంతర్యమేమిటన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరికి ముట్టాల్సిన ముడుపులు వారికి ముట్టడం వల్లే ఎవ్వరికి పట్టింపు లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజాధనం దోపిడీకి సిద్ధమైన కాంట్రాక్టరు, అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్మాణం నిలిపివేయాలని ఆదేశించా..



ఈ విషయంపై కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని వివరణ కోరగా పాత నిర్మాణంపై కల్వర్టు నిర్మాణం చేపట్టడంపై అధికారులను ప్రశ్నించా. ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి.. నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించా.. పాత నిర్మాణంపై కల్వర్టు నిర్మాణం చేపట్టడం ఏమిటని ప్రశ్నించినా..., పనులను నిలిపివేయాలని ఆదేశించినా నా ఆదేశాలను బేఖాతర్ చేసి నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పాటు మంత్రి కేటీఆర్, జీహెచ్‌ఎంసీ మేయర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాను.

– బొంతు శ్రీదేవి, చర్లపల్లి కార్పొరేటర్

ప్రజాసంక్షేమం కోసమే జీవితం



బీఆర్‌ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ప్రజా సంక్షేమం, పార్టీలో ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకు తన జీవితాంతం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తల బాధలు తనకు తెలుసని, ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాలు పార్టీ కార్యకర్తలు బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల అండదండలు, పార్టీ శ్రేణుల సహకారంతో బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు అత్యధిక మెజార్టీ కట్టబెట్టి మరోసారి ఉప్పల్ గడ్డపై పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ సమస్యలను పరిష్కరిస్తాం



ఉప్పల్: ఉప్పల్ ఆటో యూనియన్ ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఉప్పల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం కట్టమైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన ఆటో యూనియన్ నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆటో యూనియన్ నాయకులు తమ సమస్యలు తెలపడంతో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాస శేఖర్, యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు రఫిక్, మల్లేష్, తిరుపతి, వెంకటేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

నాట్యం.. సుమనోహరం..

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశాఖ ప్రకాశ్ శిష్య బృందం, విద్యా జ్యోతి, మీనాక్షిల భరత నాట్య ప్రదర్శన అలరించింది.



మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా బాలరాజు



మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా నల్లతీగెల బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మల్కాజిగిరి మండల పరిధిలోని ప్రధాన యూనియన్లకు సంబంధించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు సహకారాన్ని అందిస్తున్నారని, అందరు జర్నలిస్టులకు ఉపయోగపడేలా చూస్తామన్నారు. ప్రభుత్వ పథకాల్లో భాగమైన డబుల్ బెడ్‌రూమ్, దళితబంధులో స్థానిక జర్నలిస్ట్‌లకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరుతామన్నారు. ఆరోగ్య భద్రతపై దృష్టి సారిస్తామన్నారు. సలహాదారులుగా రాయుడు, భిక్షపతి, లవకుమార్, మాధవరాయుడు, మోహన్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విశాల్‌యాదవ్, కోశాధికారిగా రహమాన్, ఉపాధ్యక్షులుగా మల్లేష్‌గౌడ్, పవన్, మనోహర్, కార్యదర్శులుగా సుధాకర్, లక్ష్మారెడ్డి, మండే సురేష్, కుమ్మరిరాజు, కార్యవర్గ సభ్యులుగా సత్య, సంతోష్‌కుమార్, మహేందర్, ప్రశాంత్, శివ, ఓంకార్ తదితరులు ఉన్నారు.

ప్రధాని పర్యటనతో బంధాలు బలోపేతం

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో మన దేశ ప్రధానమంత్రి అమెరికా పర్యటన భారత్–అమెరికా సంబంధాలలో మేలు మలుపుగా అసోచామ్ తెలంగాణ చైర్మన్ కటారు రవికుమార్‌రెడ్డి అన్నారు. ఈ పర్యటన సాంకేతిక, శాస్త్రీయ, క్లీన్ ఎనర్జీ, డిఫెన్స్ సెక్టార్ల పటిష్టతకు ప్రపంచ పర్యావరణ లక్ష్యాలను సాధించడానికి, అంతర్జాతీయ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో రెండు దేశాలు అత్యంత ప్రభావవంతమైన ఆర్థిక వ్యవస్థలుగా ఎదగడానికి సహాయ పడుతుందని ఆయన ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.

ముగిసిన హ్యాపీనెస్ ట్రక్ కార్యక్రమాలు

సాక్షి, సిటీబ్యూరో: భారీ వాహనాల యజమానులు, డ్రైవర్లు.. తదితరుల కోసం మోటార్ ఇండియా ఆధ్వర్యంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రయాణం చేస్తున్న హ్యాపీనెస్ ట్రక్ శనివారం నగరానికి చేరుకుంది. ఈ టూర్‌లో భాగంగా రాష్ట్రంలోని నిజామాబాద్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వాహన పరిశ్రమ, రవాణా విశేషాలపై అవగాహన, విజ్ఞాన వినోద కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహక సంస్థలు సీకే బిర్లా, ఎన్‌బీసీ బేరింగ్స్ ప్రతినిధులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాప్రా: శ్రీశ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. కాలనీలోని సమస్యలపై ఆదివారం స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. స్పందించిన కార్పొరేటర్.. తక్షణమే కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ట్రెజరర్ శంకర్‌రావు, సభ్యులు క్రిష్టన్, కల్పన, కృష్ణారెడ్డి, సుభాష్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘటం ఎదుర్కోలు ప్రారంభం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆనవాయితీగా 15 రోజుల ముందు అమ్మవారి ఘటం ఎదుర్కోలు ఆదివారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా అమ్మవారి ఘటానికి స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతరకు రాలేనివారు అమ్మవారిని ఘటం రూపంలో పూజిస్తారని దశాబ్దాలుగా అమ్మవారిని ఘటం రూపంలో మల్కాజిగిరి గ్రామంలో ఇంటింటికీ ఊరేగింపుగా తీసుకెళ్తున్నారన్నారు. మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మంజులగౌడ్ మల్కాజిగిరిలో ఘటానికి స్వాగతం పలికారు.



ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని భూదేవినగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు డాక్టర్ రమేష్ కుమార్ తెలిపారు. గుడ్‌నైట్ అప్టిషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో నేత్ర వైద్యురాలు డాక్టర్ బి.లక్ష్మీరెడ్డి వైద్య సేవలు అందించారు. రైల్వేగేట్ సమీపంలోని క్లియర్ సైట్ ఐ క్లినిక్ వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నేత్ర వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు.



పెట్రోల్ బంక్ వద్దు.. కల్యాణ మండపంతో మేలు



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న కుషాయిగూడ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

కాప్రా: కుషాయిగూడ శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆలయ స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంపై కుషాయిగూడ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ శిరీషరెడ్డి.. దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో దసరా ఉత్సవాల నిర్వహణ, నిత్యం ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ స్థలం ద్వారా ఆలయానికి నిధులు సమకూర్చుకోవాలంటే ఆ స్థలంలో నిర్మాణం చేపట్టి కింద భాగంలో భక్తుల వాహనాల పార్కింగ్, పైభాగంలో కల్యాణ మండపం నిర్మిస్తే ఆలయానికి ఆదాయంతో పాటు భక్తులకు కూడా సౌకర్యంగా ఉంటుందని వివరించారు. కుషాయిగూడ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో పోరాడుదాం



సీనియర్ సిటిజన్ సంఘం సమావేశం

రామంతాపూర్: సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం కార్యవర్గం సమావేశం ఆదివారం స్థానిక గుప్తా గార్డెన్‌లోని సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కపిలేశ్వరరావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు ప్రభుత్వ సర్వీసు పెన్షన్లతో పాటు ఆసరా పెన్షన్ల సమస్యల గురించి ప్రజాప్రతినిధులకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించి పరిష్కారం సాధించే దిశగా ఐకమత్యంతో పోరాడాలన్నారు. కొత్తగా వృద్ధాప్య వికలాంగుల పెన్షన్ల మంజూరు కోసం ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన సంఘం ప్రధాన కార్యదర్శి జాలి వెంకట్‌రెడ్డి, ప్రతినిధులు కోటేశ్వరరావు, కాదేరేశ్వరరావు, రాజిరెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు



పరిమళనగర్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్ పార్థ

కాప్రా: ఇటీవల కాలంలో కార్డియాక్ అరెస్టుతో పలువురు మృతి చెందుతున్న నేపథ్యంలో పరిమళనగర్ కాలనీలో సీపీఆర్‌పై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన వచ్చినప్పుడే కార్డియాక్ మరణాలు చాలా వరకు నియంత్రించవచ్చనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు డాక్టర్ విజయ్ పార్థా తెలిపారు. ఆకస్మిక గుండెపోటు సంభవించిన సందర్భాల్లో సీపీఆర్ విధానంతో గుండెకు రక్త ప్రసరణ అందడం, నోటి ద్వారా ఆక్సిజన్ అందించడంతో గుండె పని చేయడం ప్రారంభించి ప్రమాదానికి గురైన వారిని రక్షించవచ్చని వివరించారు. గుండెపోటు వచ్చిన బాధితులకు తక్షణమే సీపీఆర్ చేయడంతో ప్రాణాలు కాపాడవచ్చని, ఈ ప్రక్రియను ఆ సమయంలో గోల్డెన్ హవర్‌గా భావించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మేయర్ బుచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బోడుప్పల్: అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని మేడిపల్లి మండల ప్రింట్ మీడియా(టీయూడబ్ల్యూజె–ఐజేయు) అధ్యక్షుడు లెల్లపాటి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉప్పలోజు రవిచంద్ర అన్నారు. మేడిపల్లి మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యమంలో విలేకరులు కీలక పాత్ర పోషించారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అందుకు మేయర్ బుచ్చిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిలుకూరి సుదర్శన్, కోశాధికారి ఆరికట్ల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు సంకూరి మురళి, సలహాదారులు వెల్లెంకి జయపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సిలివేరు వేణు, గౌరవ కార్యవర్గ సభ్యులు దొంతుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

వంతెన పనుల్లో వేగం పెంచాలి



వంతెన పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని కార్తికేయనగర్ ప్రధాన రోడ్డు నాలాపై రూ.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన(బ్రిడ్జి) పనుల్లో వేగం పెంచాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం వంతెన పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నాచారం నుంచి తార్నాకకు ప్రధాన రోడ్డు కావడంతో 33 అడుగుల విశాలమైన వంతెన నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కార్తికేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సతీష్‌బాబు, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, చక్రవర్తి, పున్నారావు, ఆదినారాయణ, శ్రీనివాస్, మధు తదితరులు ఉన్నారు.

ఈస్ట్ బాలాజీ హిల్స్ నూతన కమిటీ ఎన్నిక



బోడుప్పల్: ఈస్ట్ బాలాజీ హిల్స్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రధాన పోషకులుగా మంద సంజీవ్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా బొమ్మక్ బాలయ్య, భూక్యా సుమన్ నాయక్, అధ్యక్షులుగా హర్షవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎం.అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రఘునాయక్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నారాయణ, శ్రీహరిశర్మ, రంగయ్య, వేణు, వరంగల్ వాసు, రవీందర్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: నందికంటి శ్రావణ్‌కుమార్ ఫౌండేషన్, ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ సంస్థ సౌజన్యంతో ఆదివారం వెంకటాపురం డివిజన్ కానాజీగూడ నల్ల పోచమ్మ గుడి వద్ద ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ, గుండె, షుగర్, బీపీ, లివర్ పరీక్షలు నిర్వహించారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణగౌడ్, సంజీవ్‌కుమార్, నిరంజన్, శివశంకర్, సాయికుమార్, ప్రభాకర్, నందకుమార్, సందీప్, సత్య, ప్రవీణ్, బాల్‌పీర్, ఆశ, సంతోష్, మధు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.